ఎక్కువ సంపాదన పంటలను పండించాలి

మాచారెడ్డి, న్యూస్‌టుడే: తక్కువ కాలంలో ఎక్కువ సంపాదన వచ్చే పంటలను రైతులు పండించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మాచారెడ్డి మండల మహిళా సంఘాల సభ్యులు రుణాలు పొంది పంటలు పండిస్తూ, వ్యాపార దుకాణాలను నిర్వహిస్తున్నారు. వాటిని కలెక్టర్ గురువారం సందర్శించారు. మాచారెడ్డిలో డ్రాగన్ పండ్ల తోటను, దుస్తుల దుకాణం, కొత్తపల్లిలో నర్సరీ, చేపల పెంపకం, కూరగాయల సాగును, సోమారంపేటలో వరి కొనుగోలు కేంద్రాన్ని, లక్ష్మీరావులపల్లిలో డైరీ ఫాంను పరిశీలించారు. రుణాలు తీసుకొని స్వయం ఉపాధి పొందుతున్న మహిళా సంఘాల సభ్యులను అభినందించారు. సోమారంపేటలో గోదాం నిర్మాణానికి మహిళా సంఘానికి భూమి కేటాయించాలని గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రమేశ్, పౌరసరఫరాల అధికారి నరసింహారావు, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో గోపిబాబు తదితరులు పాల్గొన్నారు.



డ్రాగన్ పండ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

నస్రుల్లాబాద్, న్యూస్‌టుడే: నెమ్లి ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులు భవానీ, అబ్దుల్, తొమ్మిదో తరగతి విద్యార్థిని శరణ్య రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం దుర్గాబాయి గురువారం తెలిపారు. ఈ నెల 19వ తేదీన కామారెడ్డిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో ముగ్గురు క్రీడాకారులు ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. 28న పెద్దపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు ఆడనున్నట్లు పీఈటీ చంద్రశేఖర్ చెప్పారు.



విభాగాధిపతుల సమావేశంలో వీసీ ఆచార్య యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి తదితరులు

న్యాక్ గుర్తింపునకు సిద్ధం కావాలి

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: న్యాక్ గుర్తింపు కోసం సిద్ధం కావాలని తెవివి వీసీ ఆచార్య టి. యాదగిరిరావు సూచించారు. వర్సిటీ పరిపాలన భవనంలో గురువారం విభాగాధిపతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. న్యాక్ గుర్తింపుతో వర్సిటీకి భవన నిర్మాణ గ్రాంట్లు, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ఆర్థిక మద్దతు లభిస్తుందన్నారు. బోధన సిబ్బంది, పరిశోధకులకు అవసరమైన ప్రాజెక్టుల నిర్వహణ, ల్యాబ్‌ల ఏర్పాట్లకు విద్యార్థుల ఫెలోషిప్స్ అనివార్యమనే విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. బోధన, బోధనేతర ఉద్యోగులు, సిబ్బంది తమ శక్తి వంచన లేకుండా వర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని రిజిస్ట్రార్ యాదగిరి పేర్కొన్నారు. అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్, సీవోఈ ఆచార్య అరుణ, ఐక్యూఏసీ డైరెక్టర్ నాగరాజు, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దిశే చూపితేనే ప్రయోజనం..!

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై కొరవడిన సమీక్షలు

ఈనాడు, కామారెడ్డి

కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలు తీరు సమీక్షించేందుకు నిర్వహించాల్సిన దిశ(జిల్లా అభివృద్ధి సమన్వయ మానిటరింగ్ కమిటీ) సమావేశం ఊసే లేదు. ప్రతి మూడు నెలలకోసారి జరపాల్సిన సమావేశాలు గతంలో మొక్కుబడిగా సాగాయి. గతంలో ప్రాతినిధ్యం వహించిన ఎంపీ తన పదేళ్ల పదవీకాలంలో ఆరు సార్లు మాత్రమే నిర్వహించి మమ అనిపించారు. ఇటీవల ఎంపీగా గెలిచిన సురేష్ షెట్కార్ బాధ్యతలు చేపట్టి దాదాపు నాలుగు నెలలు కావస్తోంది. దిశ సమావేశం నిర్వహించి అభివృద్ధి పరంగా దిశానిర్దేశం చేస్తే ప్రగతి పరుగులు తీసే అవకాశముంటుంది.

ఎంపీ అధ్యక్షతన సమావేశం

దిశ కమిటీకి ఎంపీ అధ్యక్షుడిగా, కలెక్టర్ సభ్య కార్యదర్శిగా, జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పురపాలక సంఘాల అధ్యక్షులు, జిల్లా పరిషత్ ఛైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీసీఈవోలు, డీఆర్‌డీవోలతో పాటు ఎంపీ నామినేట్ చేసిన నలుగురు ఎన్జీవోలు సభ్యులుగా ఉంటారు. జిల్లా నుంచి ఎందరు ఎమ్మెల్సీలున్నా.. ఇద్దర్ని మాత్రమే సమావేశానికి పిలవాల్సి ఉంటుంది.

త్వరలో నిర్వహణకు ఏర్పాట్లు

- సురేందర్, డీఆర్‌డీవో, కామారెడ్డి

కొత్త కమిటీ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాం. నియమితులైన సభ్యులకు సమాచారం అందించి త్వరలో సమావేశ తేదీపై నిర్ణయం తీసుకుంటాం. సమావేశం నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని ఎంపీకి నివేదించాం.

చర్చించాల్సిన అంశాలు

రైతులకు పెట్టుబడి నిమిత్తం కేంద్రప్రభుత్వం 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' మంజూరు చేస్తోంది. ఏటా మూడు విడతలుగా రూ.రెండు వేల చొప్పున పంపిణీ చేస్తోంది. ఈ-కేవైసీ చేయని కారణంగా జిల్లాలో పలువురు రైతుల ఖాతాల్లో నగదు జమ కాలేదు. ఇదే విధంగా గత ఆరేళ్ల నుంచి కొత్తగా పట్టాదారు పుస్తకాలు లభించిన రైతుల పేర్లు నమోదు జరగడం లేదు.

★ ఇటీవల కేంద్ర ప్రభుత్వం గ్రామీణ సడక్‌యోజన పథకంలో సంస్కరణలు చేపట్టింది. 500 జనాభా ఉన్న ప్రతీ ఆవాసానికి రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నట్లు ప్రకటించింది. జిల్లాలో పీఆర్ విభాగంలో ఇంజినీర్ల కొరత కారణంగా ప్రతిపాదనలు రూపొందించలేదు. మరో నెల రోజుల్లో ప్రతిపాదనలు సమర్పించేందుకు గడువు ముగియనుంది.

★ అమృత్-2.0 కింద జిల్లాలోని మూడు పురపాలక సంఘాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.168 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ.10 కోట్ల మేర నిధులు జమచేయాల్సి ఉంది. ఆర్థిక సమస్యలు, ఇతరత్రా కారణాలతో జిల్లాలోని మూడు పురపాలికల్లో వాటా కింద జమ చేయాల్సిన నిధులు అందుబాటులో లేకపోవడం సమస్యగా మారింది.

★ 'ప్రధాన మంత్రి విశ్వకర్మ' పథకం కింద రుణాల కోసం జిల్లా యువత దరఖాస్తు చేసుకున్నారు. నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న పరిశ్రమల శాఖ శిక్షణతోనే సరిపెడుతోంది. నిర్దేశిత బ్యాంకుల నుంచి రుణం మంజూరుపై హామీ లభించని పరిస్థితి నెలకొని ఉంది.

★ ఎంపీ ల్యాడ్స్‌తో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎం ఫసల్ బీమా యోజన, ముద్ర రుణాలు, పీఎం ఆవాస్ యోజన, ఉపాధి హామీ, జల సంరక్షణ, రూర్బన్ పథకాల అమలుపై నిర్మాణాత్మక చర్చ జరిగితేనే కమిటీ సమావేశం ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుంది.

బస్వాపూర్ సొసైటీ విభజన రద్దు

భిక్కనూరు, న్యూస్‌టుడే: బస్వాపూర్ సింగిల్ విండో సొసైటీ విభజనను రద్దు చేస్తూ హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. బస్వాపూర్ సింగిల్ విండో ఛైర్మన్ కిష్టాగౌడ్‌పై గతంలో పాలకవర్గం సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో ఛైర్మన్ కిష్టాగౌడ్ కోర్టును ఆశ్రయించాడు. మరుసటి సమావేశంలో అవిశ్వాస తీర్మానం ఫలితాలు ప్రకటించేలోపే బస్వాపూర్ సొసైటీని బస్వాపూర్, కాచాపూర్ సొసైటీలుగా విభజన చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు చేసింది. అనంతరం బస్వాపూర్ సొసైటీకి నాగర్తి మల్లారెడ్డి, కాచాపూర్ సొసైటీకి కిష్టాగౌడ్‌ను పర్సన్ ఇన్‌ఛార్జులుగా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పర్సన్ ఇన్‌ఛార్జుల నియామకంపై ఇటీవల బస్వాపూర్ సొసైటీ వైస్ ఛైర్మన్ మద్ది స్వామి, డైరెక్టర్లు రాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, నర్సింలు హైకోర్టును ఆశ్రయించారు. అవిశ్వాసం ఎదుర్కొంటున్న కిష్టాగౌడ్‌ను తిరిగి పర్సన్ ఇన్‌ఛార్జిగా నియమించడాన్ని కోర్టు తప్పుబట్టింది. అధికారికంగా గెజిట్ ప్రచురణ లేకుండా బస్వాపూర్ సొసైటీని విభజన చేయడం చట్టవిరుద్ధం, ఏకపక్షం అని ఉత్తర్వుల్లో పేర్కొంది. పదవీకాలం ముగిసే వరకు పాత పాలకవర్గం సభ్యులను కొనసాగించాలని సూచించింది.

కొనసాగుతున్న నీటి విడుదల

నిజాంసాగర్ : నిజాంసాగర్ జలాశయంలోకి ఎగువ ప్రాంతాల నుంచి 12,150 క్యూసెక్కుల వరద వచ్చి చేరడంతో మూడు గేట్లను ఎత్తి అంతే స్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు నీటిపారుదలశాఖ ఏఈఈ శివప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1404.90 అడుగుల (17.687 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని చెప్పారు.



అటవీ సరిహద్దుల గుర్తింపుపై వాగ్వాదం

గాంధారి, న్యూస్‌టుడే: గౌరారం పరిధిలో అన్యాక్రాంతమవుతున్న అటవీ భూమిని కాపాడేందుకు గ్రామస్థులు నాలుగేళ్లుగా పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ఎట్టకేలకు రెవెన్యూ, అటవీ అధికారులు గురువారం సంగోజిపేట్ శివారులోని అటవీభూమి 627 సర్వే నంబరులో సంయుక్త సర్వే నిర్వహించి సరిహద్దులను గుర్తించే పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో వెంకటాపూర్ తండాకు చెందిన ఓ వర్గం వారు గౌరారం గ్రామస్థులను అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఎస్సై ఆంజనేయులు ఘటనా స్థలానికి చేరుకొని వారిని సముదాయించారు. 'న్యూస్‌టుడే' ఈ విషయంపై తహసీల్దార్ సతీష్‌రెడ్డిని చరవాణిలో వివరణ కోరగా .. రెవెన్యూ సిబ్బంది సరిహద్దు గుర్తింపుల నిర్ధారణ చేశారు. నివేదికను ఆర్డీవోకు పంపించనున్నట్లు చెప్పారు. గాంధారి ఎఫ్‌ఆర్వో హేమచందన, బాన్సువాడ ఎఫ్‌ఆర్వో హబీబ్‌ను వివరణ కోరగా 627 సర్వే నంబరులో వెంకటాపూర్‌కు చెందిన వారికి ఎఫ్‌ఆర్వో పట్టాపుస్తకాలు లేవు. అటవీ భూమిపై పూర్తి సర్వే గుర్తింపుల నిర్ధారణ కాలేదు. మరో రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి అన్యాక్రాంతమైన అటవీభూమిని స్వాధీనం చేసుకొని కందకాలు తీయిస్తామని చెప్పారు. ఈ ఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదని ఎస్సై ఆంజనేయులు చెప్పారు.



ఘటనా స్థలంలో గుమిగుడిన జనం

బీడీ కార్మికులకు జీవన భృతి అందించాలి

బీబీపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బీడీ కార్మికులందరికి రూ.4016 జీవన భృతి అందించాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.సిద్ధిరాములు అన్నారు. గురువారం బీఎల్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బీబీపేట మండల బీడీ కార్మికులతో ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. 2014 ఫిబ్రవరి 28వ కటాఫ్ తేదీని తొలగించి జీవనభృతిని రూ.2016 నుంచి రూ.4016లకు పెంచాలన్నారు. కార్యక్రమంలో బీఎల్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, రాష్ట్ర నాయకుడు ఎల్లయ్య, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ, రాష్ట్ర నాయకులు వెంకటలక్ష్మి, లింగం పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న మహిళలు

వ్యవసాయ రుణం చెల్లించని రైతు

తనఖా పెట్టిన భూమిని స్వాధీనం చేసుకున్న బ్యాంకు



డీసీసీబీ బ్యాంకు పేరుతో రైతు పొలంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

జుక్కల్, న్యూస్‌టుడే: వ్యవసాయ రుణాన్ని సకాలంలో చెల్లించని రైతు సాగు భూమిని బ్యాంకు అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని నాగల్‌గావ్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓ రైతు 2016లో తన సాగు భూమిని (ఆరు ఎకరాల నాలుగు గుంటలు) తనఖా పెట్టి నిజామాబాద్ కేంద్ర సహకార బ్యాంకు .. జుక్కల్ శాఖ నుంచి రూ.6 లక్షల రుణం తీసుకున్నాడు. ప్రస్తుతం ఆ మొత్తం రూ.14 లక్షలకు చేరింది. సకాలంలో బకాయిలు చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు పలుమార్లు రైతుకు నోటీసులు పంపించారు. అయినా స్పందించకపోవడంతో గురువారం ఆ భూమిని స్వాధీనం చేసుకుంటున్నట్లు బ్యాంకు పేరుతో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.



కామారెడ్డిలోని వాసవీకాలనీలో నెల రోజుల నుంచి పగటిపూట వీధి దీపాలు వెలుగుతున్నాయి. ఈ కాలనీలో సిబ్బంది పర్యటించి వీధి దీపాల నిర్వహణను పరిశీలించిన దాఖలాలు లేవు. కాలనీవాసులే ఈ సమస్యను పలుమార్లు కౌన్సిలర్‌కు విన్నవించారు.



జిల్లాకేంద్రంలోని ధర్మశాల నుంచి సైలన్‌బాబాకాలనీ వరకు కి.మీ మేర పొడవున్న రోడ్డులో అక్కడక్కడ వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి చీకటిగా ఉంటోంది. వార్డులో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. దీపాలు పాడై నెల దాటినా మరమ్మతులు చేపట్టడానికి సిబ్బంది రావడం లేదని స్థానికులు వాపోతున్నారు.

పగలే వెలుగు.. రాత్రి చీకటి

కామారెడ్డిలో గాడితప్పిన వీధి దీపాల నిర్వహణ

న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

జిల్లాకేంద్రంలో వీధి దీపాల నిర్వహణ గాడి తప్పింది. అంతర్గత కాలనీల్లో పగటి పూట దీపాలు వెలుగులు పంచుతున్నాయి. కొన్ని చోట్ల రాత్రిపూట దీపాలు వెలగక అంధకారం నెలకొంటోంది. కొంతకాలంగా ఈ సమస్య ఉన్నా అధికార యంత్రాంగం పట్టనట్లు వ్యవహరిస్తోంది. విద్యుత్తు బిల్లులు తడిసి మోపెడవుతున్నా అధికారుల పర్యవేక్షణ కొరవడి బల్దియా ఆదాయానికి గండి పడుతోంది.

మెరుగుపరిస్తేనే మేలు..

ప్రధాన ప్రాంతాలతో పాటు అంతర్గత కాలనీల్లో దీపాల నిర్వహణ విషయంలో సమూల మార్పులు అవసరం. పాత దీపాలను తొలగించి వాటి స్థానంలో ఆటోమెటిక్ ఆన్ ఆఫ్ సౌకర్యం ఉన్న దీపాలు అమర్చాలి. వీధి దీపాల నిర్వహణను పర్యవేక్షిస్తున్న ఇంజినీరింగ్ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో కాలుకదపాలి. కాలనీల్లో ప్రతి స్తంభానికి దీపం వెలుగుతుందా.. లేదా? అని ప్రతి పక్షం రోజులకోసారి పర్యవేక్షించాలి. తద్వారా దీర్ఘకాలికంగా పాడైన చోట మరమ్మతులు చేపట్టడానికి ఆస్కారం ఉంటుంది. దీపాలను సిబ్బంది సకాలంలో ఆఫ్ చేస్తేనే విద్యుత్తు దుబారాను అరికట్టవచ్చు. ఈ విషయమై కమిషనర్ సుజాత స్పందిస్తూ.. వీధి దీపాలు పాడైన చోట కొత్తవి అమర్చాలని సిబ్బందికి సూచిస్తామన్నారు. పగటిపూట దీపాలు వెలగకుండా కట్టడి చేసేలా చర్యలు చేపడతామన్నారు.

జిల్లాకేంద్రంలో	జనాభా	అంతర్గత కాలనీల్లో	ప్రధాన	కేంద్రీకృత
వార్డులు 49	1,04,236	వీధి దీపాలు 5100	ప్రాంతాలు: 2200	దీపాలు: 420

ఆడించేవారు లేక.. ఆటలకు దూరం..

శుద్ధ జలం.. ఉత్త ముచ్చట

... వివరాలు 8వ పేజీలో

అన్నదాతలకు అండగా ఉంటాం

ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉత్తర తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ వార్షిక టారిఫ్ ప్రతిపాదనలపై విద్యుత్తు నియంత్రణ మండలి(ఈఆర్‌సీ) నిజామాబాద్ కలెక్టరేట్‌లో గురువారం బహిరంగ విచారణ నిర్వహించింది. కార్యక్రమానికి ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఆయా వర్గాల ప్రతినిధుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కొందరు రైతుల విషయమై ప్రస్తావించగా వివరణ ఇచ్చారు. అన్నదాతల సమస్యలు పరిష్కరించేందుకు విద్యుత్తు అధికారులు పొలంబాట నిర్వహిస్తున్నారని చెప్పారు. వదులు తీగలు, వంగిన స్తంభాలు అప్పటికప్పుడు సరిచేస్తున్నారని తెలిపారు. తమ శాఖపరంగా సమస్యలు తలెత్తితే 1912 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. డిచ్‌పల్లి మండలం సుద్దులం గ్రామానికి చెందిన రైతు 2022లో విద్యుత్తు ప్రమాదంలో మరణిస్తే కుటుంబానికి పరిహారం రాలేదని రైతు నాయకుడు సాయిరెడ్డి పేర్కొనగా సీఎండీ తక్షణమే స్పందించారు. ఈఆర్‌సీ ఛైర్మన్ తన్నీరు శ్రీరంగరావు చేతుల మీదుగా రైతు భార్య కమలమ్మకు రూ.5 లక్షల పరిహారం చెక్కు అందజేశారు.

ఒత్తిడి వస్తున్నా.. ముందుకు సాగలేక

కొనుగోళ్లపై అధికారుల తర్జనభర్జన

ఈనాడు, నిజామాబాద్

ధాన్యం సేకరణలో మిల్లర్ల అంశంపై 26వ తేదీన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం వెలువడనుంది. అప్పటి వరకు వేచిచూడకుండా రైతుల నుంచి ముందస్తు కొనుగోళ్లు చేయించాలని ఉన్నతస్థాయిలో చేసిన ఆలోచన ముందుకు పడటం పడటం లేదు. తూకాలు వేయించి ప్రభుత్వ గోదాముల్లో నిల్వ చేయాలనే మౌఖిక ఆదేశాలున్నాయి. కానీ, ఇలా చేయటం వల్ల రెండు రకాల ఇబ్బందులు తలెత్తుతాయనే అభిప్రాయం అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

పాత విధానంలో అయితే కాంటా వేయగానే బస్తాలు లారీల్లో తరలించి మిల్లుల వద్ద దించుతారు. లోడింగ్ ఛార్జీలు కేంద్రాల నిర్వాహకులు, దించేచోట మిల్లర్లు హమాలీ ఖర్చులు భరిస్తారు. కానీ, ముందస్తు కొనుగోలు చేసి తిరిగి వాటిని మిల్లులకు తరలించాల్సి వస్తే హమాలీ, రవాణా ఖర్చులు రెండుసార్లు భరించాల్సి వస్తుంది. వీటిని ఏ లెక్కలో చూపించాలో స్పష్టత లేదు. రెండోది ధాన్యం నిల్వ సందర్భంలో రోజులు గడిచే కొద్దీ తేమశాతం మరింత తగ్గి బరువులో తేడా వస్తుంది. మిల్లులకు తీసుకెళ్లాక తూకం తగ్గితే మిల్లర్లు అంగీకరించని పరిస్థితులు తలెత్తుతాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే కాంటాలు ప్రారంభించటానికి ఆలోచన చేయాల్సి వస్తోందని ఓ కీలక అధికారి 'ఈనాడు'తో చెప్పారు.

సమస్యలపై చర్చించి..

ధాన్యం సేకరణకు ఇరు జిల్లాల్లో కలిపి 1060 కొనుగోలు కేంద్రాలు ప్రతిపాదించారు. ఇప్పటికే 250 వరకు కేంద్రాలు తెరిచారు. కానీ, తూకాలు ప్రారంభించలేదు. పంట కోసిన రైతులు ధాన్యం కేంద్రాల వద్దకు తెచ్చి ఆరబోస్తున్నారు. కొనుగోలు చేయాలని సహకార సొసైటీల సిబ్బందిని అడుగుతున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను గమనించి జిల్లా ప్రజాప్రతినిధులు అధికారులపై ఇదే విషయంలో ఒత్తిడి చేస్తున్నారు. బుధవారం పౌరసరఫరాలశాఖ మంత్రి వద్దకు వెళ్లి ఇదే అంశంపై మాట్లాడిన విషయం తెలిసిందే. ముందస్తు కొనుగోళ్లు జరపాలని అధికారులకు వారు సూచించారు. గురువారం మంత్రి స్వయంగా ఇరు జిల్లాల కలెక్టర్లతో ఇదే విషయంపై మాట్లాడినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే వారు జిల్లా యంత్రాంగంతో మరోమారు పరిస్థితిపై సమీక్షించారు. కానీ, గతంలో మిల్లర్లతో ఒప్పందాలు లేకుండా ముందస్తు కొనుగోళ్లు జరిపిన సందర్భంలో మంచిర్యాల ప్రాంతంలో సమస్య ఉత్పన్నమైన విషయం చర్చకు వచ్చింది. అప్పట్లో అధికారులు భద్రపరిచిన ధాన్యం నాణ్యతపై మిల్లర్లు అభ్యంతరాలు తెలిపి తీసుకోలేదు. గురువారం సైతం ఎటూ తేల్చుకోలేక కాంటాలు వేయకుండా వేచిచూద్దామనే ఆలోచన వైపే మొగ్గుచూపారు.



బండ రాళ్లే అడ్డుగా!

గుంత చుట్టూ రాళ్లు అడ్డుపెట్టిన ఈ దృశ్యం కామారెడ్డి పట్టణంలోని గాంధీగంజ్ నుంచి సిరిసిల్లరోడ్డు వెళ్లే దారిలోనిది. ఏడాది కాలంగా సమస్య ఉన్నా యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రాత్రి వేళ గుంత కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

సమస్యలు తొలగేలా.. పనులు సాగేలా

● మంచిప్ప-కొండెం రిజర్వాయర్ సామర్థ్యం నిర్ధారణపై సర్వే


ఈనాడు, కామారెడ్డి

గోదావరి జలాల తరలింపు నిమిత్తం చేపట్టిన ప్యాకేజీ-21,22 పనులను పూర్తిచేసేందుకు నీటిపారుదల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పనులకు అడ్డంకిగా మారిన మంచిప్ప-కొండెం రిజర్వాయర్ సామర్థ్యం నిర్ధారణకు సర్వే నిర్వహిస్తున్నారు. రిజర్వాయర్ సామర్థ్యం 3.5 టీఎంసీలకు పెంచాలని భారాస ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. దీంతో సమీపంలోని తండాలు, సాగు భూములు ముంపునకు గురయ్యే అవకాశం ఏర్పడడంతో స్థానికులు భూ సేకరణకు అడ్డంకులు సృష్టించారు. దీంతో జలాల తరలింపు కొలిక్కిరావడం లేదు.

ప్రాజెక్టు స్థితిగతులపై సమీక్ష

● కాళేశ్వరం ప్యాకేజీ-22 పనుల పూర్తితో ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాలతో పాటు మెదక్ జిల్లాలో రెండు లక్షల ఎకరాల భూములు సస్యశ్యామలం కానున్నాయి. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు నెలరోజుల కిందట నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమక్షంలో నీటిపారుదల శాఖ అధికారులతో ప్యాకేజీ-22 పనుల స్థితిగతులపై సమీక్ష నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న భూంపల్లి రిజర్వాయర్‌తో పాటు మోతె, కాటెవాడి, తిమ్మక్‌పల్లి రిజర్వాయర్‌ల నిర్మాణానికి నీటిపారుదల శాఖ అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించారు. ఇదే సమయంలో మంచిప్ప రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం తగ్గిస్తేనే సమస్యకు పరిష్కారం లభించి అమ్రాబాద్ వద్ద సొరంగం తవ్వకానికి మార్గం సుగమం అవుతుందని నీటిపారుదల శాఖ అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

● వారం రోజుల కిందట నీటిపారుదల శాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్ సమక్షంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు నిజామాబాద్ గ్రామీణ ఎమ్మెల్యే భూపతిరెడ్డితో కలిసి నిజామాబాద్, కామారెడ్డి సీఈలు, ప్యాకేజీ-22 పనులను పర్యవేక్షించే ఇంజినీరింగ్ అధికారులతో క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు. మంచిప్ప రిజర్వాయర్ సామర్థ్యం నిర్ధారణకు రీసర్వే నిర్వహించాలని నిర్ణయించారు. ప్రక్రియ సాగుతోంది.



ఈఎన్సీ అనిల్‌కుమార్ నిర్వహించిన సమీక్షకు హాజరైన ఎల్లారెడ్డి, నిజామాబాద్ గ్రామీణ ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, భూపతిరెడ్డి

సమగ్ర నివేదిక సమర్పించాం

- శ్రీనివాస్, సీఈ, నీటిపారుదల శాఖ, కామారెడ్డి

ప్యాకేజీ-22 పనుల పూర్తికి నీటిపారుదల శాఖ ఈఎన్సీ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. మంచిప్ప రిజర్వాయర్ నీటి సామర్థ్యం నిర్ధారణపై రీసర్వే చేపట్టాలని నిర్ణయించారు. భూసేకరణ, ఇతరత్రా పనుల పూర్తికి కావాల్సిన నిధులకు సంబంధించిన వివరాలతో అధికారులకు సమగ్ర నివేదిక సమర్పించాం.



ప్రభుత్వ వసతిగృహాల్లో నీటి శుద్ధి యంత్రాలు పనిచేయడం లేదు. ఫలితంగా విద్యార్థులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. గతంలో యంత్రాలు ఏర్పాటుచేసినా తర్వాత వాటి నిర్వహణ గాలికి వదిలేయడంతో నిరుపయోగంగా మారాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలని.. స్వచ్ఛమైన నీటిని అందించేలా ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

శుద్ధ జలం.. ఉత్త ముచ్చట


➜ వసతిగృహాల్లో పనిచేయని యంత్రాలు

న్యూస్‌టుడే, నందిపేట్

విద్యార్థులు కుళాయి నీరు తాగి అనారోగ్యాల బారిన పడేవారు. సమస్యను తెలుసుకున్న ప్రభుత్వం జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాలకు నీటి శుద్ధియంత్రాలు అందజేసింది. వీటి నిర్వహణ బాధ్యతలు ఓ కంపెనీకి కట్టబెట్టింది. తర్వాత నిర్వహణ పట్టింపు లేకపోవడం.. కొంత కాలానికి ఒప్పందం పూర్తయింది. ఫలితంగా యంత్రాలు చెడిపోయాయి. జిల్లాలో 70 శాతానికి పైగా వసతిగృహాల్లో ఇదే పరిస్థితి. సమస్యను పిల్లల తల్లిదండ్రులు అధికారులకు విన్నవించినా స్పందించకపోవడంతో పిల్లలు కుళాయి నీరే తాగుతున్నారు. కొన్ని చోట్ల ప్రైవేటు ప్లాంట్ల నుంచి వార్డెన్లు జలాన్ని తెప్పిస్తున్నారు.

జిల్లాలో వసతిగృహాల వివరాలు (పదో తరగతి వరకు)

శాఖ	హాస్టళ్లు	విద్యార్థులు
సాంఘిక సంక్షేమ	32	2100
వెనుకబడిన తరగతుల	19	1887
గిరిజన	6	1049



కుద్వాన్‌పూర్ బీసీ వసతిగృహంలో పనిచేయని ప్లాంటు

ముగిసిన మిషన్ల గడువు

నీటి శుద్ధి ప్లాంట్లు కొనుగోలు చేసిన సమయంలో విక్రయించిన కంపెనీ వీటి పనితీరును అధికారులకు తెలియజేసింది. ఇవి ఐదేళ్ల పాటు మాత్రమే పనిచేస్తాయని ఆ తర్వాత వాటి పరిస్థితి తెలుసుకొని వినియోగించుకోవాలని సూచించింది. జిల్లాలో 2014లో యంత్రాలు సరఫరా చేయగా 2019లో పనిచేసే గడువు ముగిసింది. అంతకు ముందే వీటిని పరిశీలించి ఎన్ని పనికి వస్తాయి. కొత్తవి ఎన్ని ఏర్పాటుచేయాలని ప్రణాళిక తయారు చేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి నీటి సమస్యలు తీర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తాం

- నిర్మల, జిల్లా సాంఘిక సంక్షేమాధికారిణి

నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేసి చాలా కాలం అవుతోంది. అవి పనిచేయడం లేదని నా దృష్టికి వచ్చింది. కొత్తవి కొనుగోలు చేసేందుకు కొంత ఇబ్బందిగా ఉంది. వచ్చే విద్యా సంవత్సరంలో కొత్తవి అందుబాటులోకి తెస్తాం. అప్పటి వరకు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.



ఉద్యోగార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డా.రియాజ్

ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తాం

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ జాబ్ క్యాలెండర్ ప్రకారం భర్తీ చేస్తామని, అందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డా.రియాజ్ అన్నారు. నిజామాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న ఆయన ఆర్మూర్ గ్రంథాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పుస్తకాల గదిని పరిశీలించారు. ఇక్కడికి పెద్ద సంఖ్యలో ఉద్యోగార్థులు రావడం చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఎక్కడా లేని విధంగా నిజామాబాద్, ఆర్మూర్ గ్రంథాలయాలు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంటున్నాయన్నారు. ఉద్యోగార్థులతో మాట్లాడారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవని, పై అంతస్తు నిర్మాణ పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్, కార్యదర్శిని చరవాణిలో సంప్రదించి ఆదేశించారు. అవసరమైన నిధులు ఇస్తామని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగులకు అండగా ఉన్నారని, నిరాశ చెందకుండా కష్టపడి చదవాలన్నారు. రిజిస్టర్‌తో పాటు సలహాలు, ఫీడ్ బ్యాక్ పుస్తకాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రంథపాలకురాలు వరలక్ష్మి ఉద్యోగార్థులతో కలిసి ఆయనను సన్మానించారు. ఆయన వెంట డా.కందికొండ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

ఆడించేవారు లేక.. ఆటలకు దూరం..

అండర్-19 జిల్లా జట్ల ఎంపికలో వీడని సందిగ్ధం

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం

పాఠశాల దశలో క్రీడల్లో రాణించే విద్యార్థులు మరింత నైపుణ్యం సాధించేలా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఏటా మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తోంది. అండర్-14, 17 విభాగాల్లో పాఠశాల విద్యార్థులు, అండర్-19 విభాగంలో ఇంటర్ వారికి పోటీలు నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో రాణిస్తున్న విద్యార్థులు కళాశాలల్లో చేరాక ఆటలకు దూరమవుతున్నారు. ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ఇంటర్ విద్యార్థులు పాల్గొని నైపుణ్యాలు ప్రదర్శించే అవకాశం ఉండగా.. ప్రస్తుతం ఫిజికల్ డైరెక్టర్లు (పీడీలు) లేకపోవడంతో వారికి సాధన చేయించలేని పరిస్థితి. కాగా.. అండర్-19 విభాగం ఎంపికలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

విద్యార్థులకు నష్టం..

ఏళ్లుగా జూనియర్ కళాశాలల్లో పీడీలను నియమించకపోవడంతో క్రీడలు కొనసాగించలేక పోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాల స్థాయిలోనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థులు చాలామంది ఉన్నారు. పీడీలు లేకపోవడం కారణంగా జట్టు ఎంపికకు ఇంటర్ విద్యాశాఖ వెనకడుగు వేస్తోంది. విద్యార్థులకు ప్రయోజనకరమైన అనుమతిస్తే తీసుకెళ్లేందుకు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సిద్ధంగా



సిర్నాపల్లిలో కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తహసీల్దార్ వెంకట్రావ్ (పాతచిత్రం)

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి జిల్లాలో నిజామాబాద్‌లో 16, కామారెడ్డిలో 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా.. కేవలం ఆర్మూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాత్రమే ఒక పీడీ ఉండేవారు. ఆయనే రెండు జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా వ్యవహరిస్తూ ఉత్తమ క్రీడాకారులతో ఎంపిక చేసిన ఇంటర్ జట్టును రాష్ట్రస్థాయికి పంపేవారు. సదరు పీడీ ఆరునెలల క్రితం పదవీ విరమణ పొందారు. ఈ క్రమంలో నవంబరు 3న నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు అండర్-14, అండర్-17 జట్ల ఎంపిక పూర్తి ఉన్నా.. ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ నుంచి అనుమతి రాలేదని ఉన్నతాధికారులు పేర్కొనడంతో విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతోంది. క్రీడల్లో ధ్రువపత్రాలు సాధిస్తే ఉన్నత చదువులు చదవేందుకు, ఉద్యోగాలు సాధించేందుకు అవకాశాలు మెరుగవుతాయని విద్యార్థులు పేర్కొంటున్నారు.

ఇలా చేయొచ్చు..

పాఠశాల స్థాయిలోని సీనియర్ పీఈటీ లేదా జూనియర్ కళాశాలల్లోని సీనియర్ అధ్యాపకుడిని కార్యదర్శిగా నియమించి.. పాఠశాల పీఈటీలతో ఎంపికలు పూర్తి చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపొచ్చని క్రీడా నిపుణులు పేర్కొంటున్నారు. ఆ దిశగా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని కళాశాల జిల్లా జట్టు ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

నిధుల లేమి, భద్రత విషయంలో వెనకడుగు

- రవికుమార్, డీఐఈవో, నిజామాబాద్



ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒక పీడీ లేకపోవడంతో సమస్య తలెత్తింది. జట్టును పంపాలంటే ఒకరికి బాధ్యత అప్పగించాలి. క్రీడాకారులను పోటీలకు తీసుకెళ్లాలంటే నిధులు అవసరం. భద్రత, నిధులు లేకపోవడం వల్లే విద్యార్థులను అనుమతించడం లేదు.

కొత్త రేషన్ డీలర్ల నియామకాల్లో జాప్యం

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

కామారెడ్డి జిల్లాలో కొత్త రేషన్ డీలర్ల నియామకాల ప్రక్రియ నెమ్మదించింది. ఆగస్టులో రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించి అర్హుల జాబితా విడుదల చేశారు. 70 మందికి నియామక పత్రాలు అందజేశారు. సెప్టెంబరులో ఆర్డీవో కార్యాలయాల్లో కొత్త డీలర్లకు లైసెన్సులు జారీ చేశారు. కొత్త డీలర్ల జాబితా ఆర్డీవో కార్యాలయాల నుంచి పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి వెళ్లింది. అక్కడ కొత్త డీలర్లు, వారి కుటుంబీకుల బయోమెట్రిక్ నమోదు ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. వాస్తవానికి అక్టోబరు నుంచే కొత్త డీలర్ల ప్రక్రియ పూర్తి చేసి రేషన్ దుకాణాలు కేటాయిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఇప్పుడు నవంబరులో కూడా కొత్త దుకాణాల కేటాయింపు ఉంటుందో లేదోనని సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.



త్వరగా పూర్తిచేస్తే మేలు

డీలర్ల పోస్టులు ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాలను ఇన్‌ఛార్జులతో నెట్టుకొస్తున్నారు. ఒక్కో డీలర్‌కు రెండు మూడు దుకాణాలకు ఇన్‌ఛార్జిగా నియమించారు. దీంతో బియ్యం పంపిణీలో జాప్యం తలెత్తుతుంది. కొందరు లబ్ధిదారులు ఇతర గ్రామాల్లోని దుకాణాలకు వెళ్లి బియ్యం తెచ్చుకుంటున్నారు. కొత్త డీలర్ల నియామకాలు త్వరగా పూర్తి చేస్తే లబ్ధిదారులకు సకాలంలో బియ్యం పంపిణీ పూర్తవుతుంది. బయోమెట్రిక్ నమోదు అధికారాన్ని ప్రభుత్వం పౌరసరఫరాలశాఖకే అప్పగించింది. ఈ విషయమై ఇన్‌ఛార్జి డీఎస్‌వో నర్సింహారావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. బయోమెట్రిక్ నమోదు పూర్తి చేసిన తర్వాత కొత్త డీలర్ల వివరాలను కమిషనరేట్‌కు పంపించి, కొత్త దుకాణాలు కేటాయిస్తామన్నారు.



లైసెన్స్ పత్రాలను చూపుతున్న నూతన రేషన్ డీలర్లు

కేటీఆర్‌కు స్వాగతం



ఆదిలాబాద్ జిల్లాలో గురువారం చేపట్టిన రైతు ధర్నాకు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వెళ్తుండగా.. జిల్లాకేంద్రం శివారులోని 44వ జాతీయ రహదారిపై ఆయనకు పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ స్వాగతం పలికారు. అనంతరం జిల్లాకు చెందిన కామారెడ్డి, ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన భారాస నాయకులు కేటీఆర్ వెంట ఆదిలాబాద్‌కు వెళ్లారు.

– న్యూస్‌టుడే, కామారెడ్డి అర్బన్

ఉత్తమ పీడీకి సన్మానం: **మాచారెడ్డి, న్యూస్‌టుడే:** వరల్డ్ టీచర్స్ డే సందర్భంగా మాచారెడ్డి మండలం సోమార్‌పేట ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సంధ్య ఉత్తమ పీడీగా ఎంపికయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని స్కై లైఫ్ ఫౌండేషన్, శారదా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో బిర్లా ఆడిటోరియంలో ఆమెను సన్మానించారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కాల్వలు, వంతెనలు, భవనాల మరమ్మతు పనులు నాణ్యతగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ప్రభుత్వశాఖల ఇంజినీర్లతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఆయా శాఖలు ప్రతిపాదించిన మరమ్మతు పనులను వేగవంతం చేయడంతో పాటు నాణ్యతను పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి పనికి సంబంధించిన ఫొటోలను తనకు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆయా శాఖల ఇంజినీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోళ్లకు యంత్రాంగం సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయాశాఖల అధికారులతో ధాన్యం సేకరణపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తుందని తెలిపారు. దొడ్డు, సన్నరకం ధాన్యాలను వేర్వేరు లారీల్లో తరలించాలని సూచించారు. సన్నరకం ధాన్యం నింపిన బస్తాలను ఎరుపు దారంతో కుట్టి దానిపై 'ఎస్' అని రాయాలని పేర్కొన్నారు. దొడ్డు రకం ధాన్యం బస్తాలపై ఆకుపచ్చ రకం దారంతో కుట్టి దానిపై 'డీ' అనే అక్షరం రాయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌డీవో సురేందర్, పౌరసరఫరాలశాఖ డీఎం రాజేందర్, డీఎస్‌వో నర్సింహారావు, మార్కెటింగ్ అధికారి రమ్య, డీఎస్‌వో రాంమోహన్, డీపీఎం రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ

హామీల అమల్లో నిర్లక్ష్యం వీడాలి

కామారెడ్డి పట్టణం: కాంగ్రెస్ సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చడంలో నిర్లక్ష్యం వీడాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ అన్నారు. కామారెడ్డి జిల్లాకేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కార్మికులకు జీవనభృతి ఇస్తామని గతంలో ప్రకటించారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదికి సమీపిస్తున్నా ఇప్పటివరకు అతీగతీ లేదన్నారు. అడ్లూర్ ఎల్లారెడ్డి ప్రాంతంలో గాయత్రీ చక్కర పరిశ్రమ యాజమాన్యం రైతుల పేరిట తీసుకున్న రుణాల ఘటనపై సర్కారు సమగ్ర విచారణ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రకాశ, కిశోర్, సురేశ్ తదితరులున్నారు.

పోలియో రహిత ప్రపంచ ఏర్పాటుకు కృషి

కామారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: పోలియో రహిత ప్రపంచ ఏర్పాటుకు రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ విశేషంగా కృషి చేస్తోందని రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి అధ్యక్షుడు పి.రాజనర్సింహారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కామారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. పోలియోపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. రోటరీ ప్రతినిధులు శ్రీశైలం, ధనుంజయ్, సత్యం, సబ్బని కృష్ణహరి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న రాజనర్సింహారెడ్డి

ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు చర్యలు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని పురపాలక ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. గురువారం డెయిలీమార్కెట్, గాంధీగంజ్, సుభాశ్‌రోడ్డు ప్రాంతాల్లో పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఆమె పర్యటించారు. చిరు వ్యాపారులు రోడ్లపై విక్రయాలు చేపట్టరాదన్నారు. రైతుబజార్‌లో కూరగాయల విక్రయాలు నిర్వహించాలన్నారు. ప్రజలకు అసౌకర్యం లేకుండా పురపాలకశాఖ ఆధ్వర్యంలో దృష్టి పెట్టామన్నారు. కమిషనర్ సుజాత, ఎస్సై శ్రీరాం, నాయకులు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, పంపరి శ్రీనివాస్, సలీం తదితరులున్నారు.



కూరగాయలు విక్రయిస్తున్న మహిళతో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ ఇందుప్రియ

ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలకు ఎన్‌సీసీ యూనిట్ మంజూరైంది. ఆ యూనిట్‌ను ఎన్‌సీసీ అధికారి కల్నల్ విష్ణు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. దేశసేవ చేయడానికి ఎన్‌సీసీ సరైన మార్గమన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు హరిస్మరణ్‌రెడ్డి, బాలాజీరావు, రాజేశ్వర్‌రావు, ప్రిన్సిపల్ సాయిబాబు, అకడమిక్ ప్రిన్సిపల్ మనోజ్‌కుమార్, ఎన్‌సీసీ సుబేదార్ రాణా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రిబ్బను కత్తిరిస్తున్న అధికారి విష్ణు

గుంతల రోడ్డు మారదేమి?



నెల క్రితం కురిసిన భారీ వర్షాలకు కామారెడ్డి జిల్లాకేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చేవారే కరవయ్యారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధాన రహదారి వెంట వందలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తాయి. రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కామారెడ్డి అర్బన్

భాజపా సభ్యత్వ నమోదు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలో జేపీఎన్‌రోడ్డు, సిరిసిల్లరోడ్డు ప్రాంతాల్లో గురువారం భాజపా సభ్యత్వ నమోదును నాయకులు చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణాధ్యక్షుడు భరత్ మాట్లాడుతూ.. దేశంలో కేంద్ర సర్కారు అవినీతి రహిత పాలన అందిస్తోందన్నారు. కేంద్ర సర్కారు పథకాలను ప్రజలు గమనించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో భాజపా అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ ప్రధానకార్యదర్శి ప్రతాప్, ప్రతినిధులు శ్రీకాంత్, రజినీకాంత్, ప్రవీణ్, రాజుపాటిల్, రాజగోపాల్ తదితరులున్నారు.



సభ్యత్వ నమోదు చేయిస్తున్న భాజపా పట్టణ అధ్యక్షుడు భరత్, నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
బాన్సువాడ 83284 29129
కామారెడ్డి 93970 82242



కామారెడ్డి వాసవీనగర్‌లో పిచ్చి మొక్కలు పెరిగాయి. విష పురుగుల బెడద నెలకొంది. - **పెంటయ్య, వాసవీనగర్**

పిచ్చిమొక్కల తొలగింపు చేపట్టాం. - **పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**





జిల్లాకేంద్రంలోని గాంధీనగర్‌లో వీధి దీపం పాడైంది. కొత్తది బిగించాలి.
- **వినయ్, గాంధీనగర్**

సిబ్బందికి చెప్పి దీపం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. - **అంజల్‌రెడ్డి, కౌన్సిలర్**



రెడ్డిపేట గ్రామంలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదని కొన్ని రోజుల క్రితం మేమున్నాం మీకు తోడుగాలో ప్రచురితమవగా పంచాయతీ కార్యదర్శి నరేష్ స్పందించారు. గ్రామంలో కొత్త దీపాలు పెట్టించి సమస్య పరిష్కరించారు.



బాన్సువాడలోని ఇస్లాంపూర్ కాలనీలో పలు చోట్ల మురుగు కాల్వల్లో చెత్త నిల్వలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. - **రమేష్, బాన్సువాడ**

ఈ విషయాన్ని పర్యావరణ ఇంజినీర్ హన్మాండ్లు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బంది చేత పారిశుద్ధ్య పనులు చేయించి సమస్య పరిష్కరించారు.

పుల్కల్, వాజిద్‌నగర్ ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. **సంతోష్, పుల్కల్ గ్రామం**

రహదారిపై ఏర్పడ్డ గుంతలను పూడ్చివేస్తాం. **వినోద్‌కుమార్, ఆర్‌అండ్‌ బీ ఏఈ, బిచ్కుంద**

పిట్లం నేతాజీనగర్ గాంధీ బొమ్మ సమీపంలో స్థానికుల ఇళ్ల ఎదుట వ్యర్థాలు పడేస్తున్నారు **రాము, స్థానికుడు**

వ్యర్థాలు తొలగించి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం. **యాదగిరి, పంచాయతీ కార్యదర్శి, పిట్లం.**

ముత్యంపేటలోని ప్రధాన బజార్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. - **రమేశ్, ముత్యంపేట, దోమకొండ (మం)**

: వెలగని వాటి స్థానంలో త్వరలో వీధి దీపాలు పెట్టిస్తాం. - **అంజయ్య, గ్రామ కార్యదర్శి, ముత్యంపేట**

- న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం, దోమకొండ, పిట్లం,కామారెడ్డి పట్టణం, బిచ్కుంద గ్రామీణం, రామారెడ్డి



నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకం. ఒక్కో సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం. పాలకులు, ఉన్నతాధికారులు తరచూ చెప్పే మాటలివి. అంతటి కీలకమైన నిఘానేత్రం పాడైతే కొన్ని గంటల్లోనే బాగు చేయాలి. అప్పుడే వాటి పనితీరుకు సార్థకత లభించి, ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది.

పెద్దదేవాడలో అలంకార ప్రాయంగా సీసీ కెమెరాలు

మరమ్మతులు మరిచారు...

న్యూస్‌టుడే,బిచ్కుంద గ్రామీణం

బిచ్కుంద మండలంలోని పుల్కల్, బండారెంజల్, గుండెనెమ్లి, మాన్యాపూర్, పెద్దదేవాడ, హస్గుల్, శాంతాపూర్, సీతారాంపల్లి తదితర గ్రామాల్లోని ప్రధాన రహదారులపై గతంలో పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కొంతకాలం వాటి నిర్వహణ బాగానే ఉన్నా... ప్రస్తుతం తీగలు తెగి నిరుపయోగంగా మారాయి. మండల కేంద్రంలో మినహా ఎక్కడా పనిచేయట్లేదు. ఈ కారణంగా దొంగలు చెలరేగిపోతున్నారు. వారిని గుర్తించేందుకు అవకాశం లేక దర్యాప్తు నత్తనడకన సాగుతోంది.

● నిరుపయోగంగా నిఘా నేత్రాలు



పుల్కల్‌లో సీసీ కెమెరాల మానిటర్

జరిగిన చోరీలు

● పుల్కల్‌లో నెల రోజుల క్రితం లింగాగౌడ్ కిరాణా దుకాణం నుంచి దుండగులు నగదు, సామగ్రిని ఎత్తుకువెళ్లారు. సంగమేశ్వర్‌లో పానీ పూరి బండి తలుపుల తాళాలు పగులగొట్టి నగదు దోచుకున్నారు. మాధ్యరి సహదేవ్ ఇంట్లో చరవాణి చోరీ చేశారు.

● బిచ్కుంద మండల కేంద్రంలో మూడు నెలల కిందట ఓ మెడికల్ దుకాణం తలుపులు పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. ● పదిహేను రోజుల క్రితం దుండగుడు ఇంట్లోకి చొరబడి మహిళ మెడలో నుంచి బంగారు ఆభరణాలు అపహరించి ఆమెను హత్య చేసి పారిపోయాడు. అక్కడ సీసీ కెమెరా ఉండడంతో నిందితుడిని పట్టుకున్నారు.

దాతలు సహకరించాలి :

మోహన్‌రెడ్డి, ఎస్సై,బిచ్కుంద

మండల కేంద్రంలో సీసీ కెమెరాలు బాగానే పని చేస్తున్నాయి. గ్రామాల్లో ఏర్పాటు చేసినవి వివిధ కారణాలతో పనిచేయడం లేదు. వాటి మరమ్మతులకు దాతలు ముందుకు రావాలి. పలు ప్రాంతాల్లో కమిటీలు ఏర్పాటు చేసి సంవత్సరం వరకు వాటి నిర్వహణ చూసేలా చర్యలు చేపడుతున్నాం.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



ఆయుధాల పనితీరును వివరిస్తున్న ఎస్సై రాజు

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసు సంస్మరణోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆయా కళాశాలల విద్యార్థినీ విద్యార్థులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీలను కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు. 'తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర', 'విచక్షణతో కూడిన మొబైల్‌ఫోన్ వాడకం' అనే అంశాలపై వ్యాసరచన పోటీలను ఏర్పాటు చేశారు. విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనగా ఈ పోటీలను సీఐతో పాటు పట్టణ ఎస్సైలు తదితరులు పర్యవేక్షించారు.

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండలోని బాలికల గురుకుల పాఠశాలలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ సంగీత, ఎస్సై ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుధాల పనితీరు వివరించి..

కామారెడ్డి అర్బన్: అమరవీరుల సంస్మరణోత్సవాల్లో భాగంగా జిల్లాకేంద్రంలోని దేవునిపల్లి పోలీసుస్టేషన్‌లో ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పోలీసుల ఆయుధాల పనితీరును ఎస్సై రాజు విద్యార్థులకు వివరించారు. ఏఎస్సైలు, పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న బల్దియా ఛైర్మన్ జంగం గంగాధర్

చెత్త వేస్తే జరిమానా

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: బల్దియాను స్వచ్ఛ బాన్సువాడగా తీర్చిదిద్దేలా ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని బల్దియా ఛైర్మన్ జంగం గంగాధర్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారి వెంట ప్రత్యేక పారిశుద్ధ్య పనులను గురువారం ఆయన పరిశీలించారు. సిబ్బంది చేత పనులు చేయించారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పర్యావరణ ఇంజినీర్ హన్మాండ్లు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

పిట్లం, నిజాంసాగర్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు పెద్ద ఎత్తున సభకు హాజరై విజయవంతం చేయాలని జిల్లా మాల రాజకీయ జేఏసీ ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈ నెల 27న నాగర్‌కర్నూలులో తలపెట్టిన మాలల ఆత్మగౌరవ సభ కరపత్రాలను గురువారం పిట్లం మండల కేంద్రంలో ఆయన ఆవిష్కరించారు. నాయకులు నవీన్‌కుమార్, బాలయ్య, నాగయ్య, గంగారాం తదితరులు ఉన్నారు. నిజాంసాగర్ మండల కేంద్రంలో సభకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గైని విఠల్, బేగరి రాజు, సాయిలు, శివయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాల సాధనకు కృషి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలని ఇంటర్ విద్య జిల్లా అధికారి షేక్ సలాం అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం తల్లిదండ్రులతో సమావేశం జరిగింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జయకుమారి, అధ్యాపకులు ఫణికుమార్, విజయ, ప్రవీణ, ఇర్ఫాన్, యోగిత తదితరులున్నారు.



పిట్లంలో తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్‌కు ఓటరు పత్రాలు అందజేస్తున్న ఎంఈవో దేవిసింగ్

ఎమ్మెల్సీ ఓటరు నమోదు పత్రాలు అందజేత

పిట్లం, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్- అదిలాబాద్- కరీంనగర్ పట్టభద్రుల నియోజకర్గం, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు పత్రాలను గురువారం పిట్లం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్‌కు ఎంఈవో దేవిసింగ్ అందజేశారు. నాయబ్ తహసీల్దార్ సత్యనారాయణ, మండల నోడల్ అధికారి రమణారావు, ఉపాధ్యాయులు సంతోష్‌రెడ్డి, నారాయణ తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

నస్రుల్లాబాద్, న్యూస్‌టుడే: బస్వాయిపల్లి, నాచుపల్లి గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులపై ఆరా తీసేందుకు గురువారం రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సాంకేతిక విభాగం అధికారి అబేద్ ఖాన్, బృందం సభ్యులు గ్రామాలకు వచ్చారు. 2021-22 ఏడాదిలో ఉపాధి పనులు తక్కువ చేపట్టి, 2023-24లో ఎక్కువ పనులు చేపట్టడంపై వచ్చిన సందేహంపై పనులకు సంబంధించిన దస్త్రాలు తనిఖీ చేశారు. ఏయే పనులు చేశారని, చేసిన పనులు ఉపయోగకరంగా ఉన్నాయా? అని అధికారులు గ్రామాలకు వెళ్లి కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనుల దస్త్రాలు నవీకరించకపోవడంతో ఉపాధి, పంచాయతీ సిబ్బందిపై అబేద్ ఖాన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో సూర్యకాంత్, ఈసీ అక్మల్, పంచాయతీ కార్యదర్శి సాయిలు పాల్గొన్నారు.



బస్వాయిపల్లిలో దస్త్రాలు పరిశీలిస్తున్న అబేద్‌ఖాన్

ధాన్యం ఆరబెట్టేందుకు చోటేదీ?



బీర్కూర్ మార్కెట్ యార్డులో ధాన్యం ఆరబెట్టే స్థలంలో పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని అన్నదాతలు చెబుతున్నారు. గోదాంల వద్ద ఉన్న సీసీ రోడ్లపై ధాన్యం ఆరబోస్తుంటే వర్షానికి కొట్టుకుపోతుందని, ధాన్యం ఆరబెట్టేందుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి, పరిసరాలను శుభ్రం చేయించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై బీర్కూర్ విండో కార్యదర్శి విఠల్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. మార్కెట్ కమిటీ అధికారులతో మాట్లాడి పరిసరాలు శుభ్రం చేయించేలా చూస్తామని తెలిపారు. - **న్యూస్‌టుడే, బీర్కూర్**

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



భిక్కనూరులో మాట్లాడుతున్న డీఎల్ఎస్‌ఏ కార్యదర్శి నాగరాణి

భిక్కనూరు, న్యూస్‌టుడే: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే సత్వర న్యాయం పొందగలరని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ రెగ్యులర్ మొదటి కార్యదర్శి నాగరాణి అన్నారు. గురువారం భిక్కనూరు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మహిళలు, చిన్నారులు, వృద్ధులకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం భిక్కనూరు రైతు వేదికలోని అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలించారు. ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి, ఏపీఎం శ్రీనివాస్, ఎస్సై సాయికుమార్, రాజమణి, డీఎల్ఎస్‌ఏ సిబ్బంది ఖాన్, సాయిప్రణీత్, పీఎల్‌వీ నరేష్ పాల్గొన్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోండి

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కల్పించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్ఎస్‌ఏ కార్యదర్శి నాగరాణి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలో బీసీ సంక్షేమ బాలికల వసతిగృహాన్ని గురువారం సందర్శించిన ఆమె మాట్లాడారు. విద్యార్థినులకు భోజన వసతులు, ఆరోగ్యం, సౌకర్యాల కల్పనపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మాయ సురేష్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మోహన్‌రావు కులకర్ణి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూపరింటెండెంట్ చంద్రసేన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉప పీఠంలో శోభాయాత్ర

జుక్కల్, న్యూస్‌టుడే: ఇరవై ఐదు రోజుల పాటు 650 కిలోమీటర్ల మేర కొనసాగిన 'వసుంధర' పాదయాత్ర మహారాష్ట్రలోని పుణ్యక్షేత్రమైన నానీజ్ ధామ్‌ను విజయవంతంగా దర్శించుకొని తిరిగి తెలంగాణ ఉప పీఠానికి చేరుకున్నారు. భక్తులకు తెలంగాణ నిర్వాహకులు స్వాగతం పలికి శోభాయాత్ర నిర్వహించారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమం కనులపండువగా సాగింది. పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై హితోపదేశం చేస్తూ..నిర్వహించిన పాదయాత్రను భక్తులు విజయవంతంగా పూర్తి చేశారని దక్షిణ భారత్ పీఠాధిపతి స్వామి నరేంద్రచార్యజీ కొనియాడారు.

నేత్ర వైద్య శిబిరం

బాన్సువాడ పట్టణం: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని క్లబ్ భవనంలో గురువారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 38 మందికి పరీక్షలు చేసినట్లు నేత్ర వైద్యుడు సంపత్‌కుమార్ తెలిపారు. కంటి సంబంధిత సమస్యలున్న వారిని శస్త్రచికిత్సకు సిఫారసు చేసినట్లు పేర్కొన్నారు.

నిబంధనల ప్రకారం ధాన్యం తూకం వేయాలి

కామారెడ్డి గ్రామీణం, న్యూస్‌టుడే: కామారెడ్డి మండలంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం తూకం వేయాలని డీసీవో రామ్మోహన్ రావు పీఏసీఎస్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన గురువారం కామారెడ్డి పీఏసీఎస్ ఆవరణలో అధికారులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో పాల్గొన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని సేకరించాలని, కొనుగోలు వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ పాత లక్ష్మణ్, ఏడీఏ అపర్ణ, సీఈవో మోహన్ రావు తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీవో రామ్మోహన్ రావు



ఉప్పల్‌వాయిలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ ఛైర్మన్ సదాశివరెడ్డి

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర

రామారెడ్డి, న్యూస్‌టుడే: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని సొసైటీ ఛైర్మన్ సదాశివరెడ్డి అన్నారు. గురువారం ఉప్పల్‌వాయి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని తేమ శాతం వచ్చే వరకు ఆరబెట్టాలన్నారు. కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. సొసైటీ డైరెక్టర్ నారాయణరెడ్డి, సీఈవో భైరయ్య, అరవింద్, ప్రవీణ్ రెడ్డి, రాజిరెడ్డి, రాములు, నర్సింలు, శంకర్, రాజయ్య, నర్సయ్య, నారాయణ పాల్గొన్నారు.

ఏఈ బాధ్యతల స్వీకరణ

నాగిరెడ్డిపేట, న్యూస్‌టుడే: నాగిరెడ్డిపేట మండల విద్యుత్తు ఏఈగా జ్యోతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏడీఈ నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

టీఎన్జీవో కార్యవర్గం ఎన్నిక

మద్నూర్, న్యూస్‌టుడే: మద్నూర్ టీఎన్జీవో కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా పవన్ కుమార్, కార్యదర్శిగా రంజిత్‌కుమార్, కోశాధికారిగా విశాల్‌గౌడ్ తదితరులు ఎన్నికయ్యారు.



నిందితులను శిక్షించాలి



బిచ్కుందలో ర్యాలీ



లింగంపేట మండల కేంద్రంలో ...



నస్రుల్లాబాద్‌లో...

బిచ్కుంద, న్యూస్‌టుడే: హిందూ దేవాలయాలపై దాడిని నిరసిస్తూ బిచ్కుందలో గురువారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా కొనసాగింది. గణేష్ మందిరం నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీ చౌక్, ఊరడమ్మగల్లి, కమ్మరిగుడి చౌరస్తా, కల్లాలిచౌరస్తా, కొత్త బస్టాండ్, అంబేడ్కర్ చౌరస్తా మీదుగా చేరి పాత బస్టాండ్ వద్ద హనుమాన్ చాలీసా పఠనంతో ముగించారు. బిచ్కుంద మఠాధిపతి సోమయప్ప స్వామి మాట్లాడుతూ... నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భాజపా జిల్లా అధ్యక్షురాలు అరుణతార, కమల్‌కిషోర్‌బట్టాడ్, దర్పల్లి గంగాధర్, వెంకట్ రావు దేశాయ్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖ్ భానుదాస్ కులకర్ణి, భజరంగ్ దళ్ నాయకులు సంతోష్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్,న్యూస్‌టుడే: మండల కేంద్రంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయాలను, హిందూ ధర్మాన్ని కాపాడాలని నినాదాలు చేశారు.

నస్రుల్లాబాద్‌లో

నస్రుల్లాబాద్, న్యూస్‌టుడే: నస్రుల్లాబాద్ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గురువారం బంద్ ప్రశాంతంగా ముగిసింది. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసి బంద్‌కు సహకరించారు. నస్రుల్లాబాద్‌లో బస్టాండ్ నుంచి శ్రీరామాలయం వరకు హిందూ సంఘాల నాయకులు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు. భాజపా మండలాధ్యక్షుడు సాయిలు, రామన్న, సాయాగౌడ్, సతీష్, హన్మాండ్లు, సాయిలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకి ఆత్మహత్య

తాడ్వాయి, న్యూస్‌టుడే: మండలంలోని సంతాయిపేటకు చెందిన ముక్కు సాయికుమార్(25) కుటుంబకలహాల నేపథ్యంలో గురువారం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా వైద్యశాలకు తరలించారు.

మతిస్థిమితం కోల్పోయి...

సదాశివనగర్, న్యూస్‌టుడే: మతిస్థిమితం బాగా లేక ఇంట్లో నుంచి వెళ్లిన ఒకరు శవమై కనిపించాడు. సదాశివనగర్ ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. రామారెడ్డి మండలం గిద్దకు చెందిన జలంధర్(23) కూలి పనులు చేస్తుండేవాడు. పదిరోజుల కిందట ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో పలు ప్రాంతాల్లో గాలించారు. అయినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లి గ్రామ శివారు చెరువులో శవమై తేలాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం శివారులోని నర్సన్నపల్లి బస్టాండ్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండవచ్చని అన్నారు. తెల్లగడ్డం, నల్ల రంగు చొక్కా, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని చెప్పారు. ఎవరైనా గుర్తిస్తే పోలీసులను సంప్రదించాలన్నారు.

జూదరుల అరెస్టు

పెద్దకొడప్‌గల్, న్యూస్‌టుడే: మండలంలోని వడ్లం గ్రామంలో జూదమాడుతున్న 8 మందిని పోలీసులు బుధవారం అర్ధరాత్రి అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.30వేల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ గురువారం తెలిపారు.